
# చెలిమి

టేకుమళ్ళ వెంకటేశ్వరరావు



సుధాముడు కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. పరీక్షించి చూస్తే ఆ మూసిన కనుకొనలందు అశ్రుబిందువులు కనిపిస్తాయి. చెప్పలేని వేదన అతని ముఖంలో ప్రతిఫలిస్తోంది. కృశించిన కాయం. ధరించిన అతుకుల బట్టలు, మధ్య వయసులోనే మీద పడ్డ వృద్ధాప్య ఛాయలు అతని స్థితిని దాచలేకపోతున్నాయి.

అడుగుల అలికిడికి కనులు తెరిచాడు సుధాముడు. తన లాగే కృశించిన కాయం. అతుకుల చీర, మెడలో రంగు వెలసిన పసుపు తాడు, కనుల చుట్టూ నల్లని వలయాలు.

''కాపురానికి వచ్చినపుడు ఎలా వుండేది'' మనసులోనే రోదించాడు.

''పిల్లలెక్కడ మైత్రీ'' ఎలాగో గొంతు పెకలించుకుని అడిగాడు సుధాముడు. నూతిలో నుండి వస్తున్నంత సన్నని స్వరంతో.

''పెద్దది యాజ్ఞి గంజి కాస్తోంది. మిగిలిన వారు బయటెక్కడో ఆడుకుంటూంటారు'' అదే క్షీణించిన స్వరంతో జవాబు.

''ఊ.. పెద్దమ్మాయి, తన యీడు పిల్లలు ఎప్పుడో పెళ్ళిళ్ళు చేసుకుని కాపురాలకు కూడా వెళుతున్నారు. ఛీ వెధవ జీవనం. భార్యాపిల్లలకు కడుపునిండా భోజనం, వంటినిండా బట్టలైనాయివ్వలేకపోతున్నాను. ఎప్పటికైనా మంచిరోజులొస్తాయా'' మరోసారి రోదించింది మనసు.

'' ఏమండీ నేను చెప్పిన విషయం గురించి ఏమాలోచించారు''

'' ఏవిషయం మైత్రీ''

''అదే మీ బాల్యస్నేహితుడు కృష్ణుణ్ణి కలిసి సహాయమడిగే విషయం''

''....''

''మౌనం సమస్యల్ని పరిష్కరించదండీ, నిర్ణయం, క్రియ యివే పరిష్కరిస్తాయి. ఎటొచ్చీ అవి సరియైనవై వుండాలి''

''...''

''హూ. నడివయసులోనున్న మన కోసం కాకున్నా, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించండి. గడచిన కాలం గురించి వగచి లాభం లేదండీ''

'' ఏమని అడగను?''

''బావుంది మీ ప్రశ్న. ఇంటి పరిస్థితి మీకు తెలియనిదికాదు కదా''

''...''

''మనసులో బాధపడుతూ పైకి గంభీరంగా వుండడానికి మీరు పడుతున్న అవస్థ చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందండీ. మీ వల్ల కాని పనిని చేయమనటం లేదు. మీరు ఎలాగూ వేదం నేర్చారు. వ్యాసుల వారొనర్చిన వేద విభజననీ క్షుణ్ణంగా తెలుసుకున్నారు. పైగా పౌరోహిత్యమూ తెలుసు కాబట్టి, ఆ కృష్ణుణ్ణి బతిమాలైనా ఏదైనా గురుకులంలో చిన్న అధ్యాపక పదవిని ఇప్పించమని ప్రాధేయపడండి. కనీసం అర్చకత్వమైనా సరే. ఎలానో బతుకు సాగదీయవచ్చు. ఏమంటారు?''

''...''

''ఏవిటండీ ఉలకరూ పలకరు. మీరు అడగకూడని వాళ్ళని అడగటం లేదండీ. కృష్ణుడు మీ బాల్యస్నేహితుడు. పైగా చేయదగ్గ స్థితిలో వున్నవాడు. పరోపకారిగా పేరున్నవాడు''

''అడిగితే సహాయం చేస్తాడంటావా?''

''అడక్కుండా ఎవరు మాత్రం సహాయం చేస్తారు. అయినా అతడు ద్రుపదుని లాంటి వాడు కాడనీ, అతను కూడా కష్టాల్లో పెరిగాడని మీరేగా చెప్పారూ''

''...''

''మాట్లాడండీ''

"అదికాదు మైత్రీ, అతణ్ణి చూసి పుష్కరం దాటింది. ఆర్యావర్తమంతా కావలసిన వాడు. వ్యాపకాలా అనేకం. ఎక్కడుంటాడో తెలియదు. ఒకవేళ ద్వారకలోనే వున్నాడనుకున్నా, వారం రోజుల నడక. అదీకాక..."

"ఊ.. పూర్తిచేయండి"

"మన కర్మకి అతనేం చేయగలడు"

"అవేం మాటలండీ. మనిషికి మితిమీరిన ఆత్మస్తుతి ఎంత తప్పో, ఆత్మనిందా, ఆత్మన్యూనతా కూడా అంతే తప్పంటారు ప్రాజ్ఞులు. మీ వరస చూస్తుంటే మీకీ యిష్టం వున్నట్లు లేదు" ఆమె కంఠంలో ఒకింత కోపం నిష్ఠూరం ధ్వనించాయి.

"నిన్ను నొప్పించాలని కాదు మైత్రీ. నాకూ మన పరిస్థితిపై అవగాహన వుంది. నా చేతకాని తనంపై కోపం వుంది. ఒక్కోసారి పిచ్చి పట్టినట్లుంటుంది. పెళ్ళయిన నాటినుండి నీకొక మంచి చీర, పిల్లలకు బట్టలు, విద్యా బుద్ధులేం ఖర్మ కనీసం చదువు కూడా చెప్పించలేక పోతున్నాను. ఆకలితోనున్న వారికి చదువైనా ఎలా అబ్బుతుంది. అప్పటికీ ఈ అగ్రహారం పెద్దల యిళ్ళకి ఒక చిన్న వ్యాపకం యిప్పించమని అడగటానికి ఎన్నిసార్లు వెళ్ళానో నీకు తెలియనిది కాదు. నేను నేర్చిన విద్య నాకూ భోజనం పెట్టటం లేదు. ఇతరులకూ ఉపయోగపడటం లేదు. పెద్దలిచ్చిన ఈ ఇల్లు తప్ప ఆస్తులా సున్నా. గ్రాసం ఇతరులదైనా వాసం మనదుండాలంటారు. అలా ఎండా వానలకు బాధపడకుండా మనలాగే జీర్ణావస్థలో వున్న ఈ ఇల్లే కాపాడుతోంది. అప్పుడప్పుడు పౌరోహిత్యం వల్ల, మధూకరం వల్ల ముఖ్యంగా వంటలక్కగా నువ్వు సంపాదిస్తున్న గ్రాసం వల్ల ఈ ఇల్లు ఇంత మాత్రమైనా నడుస్తోంది. కడుపు నిండిన వాళ్ళు ఉన్నదాంతో తృప్తి పడాలని బోధిస్తారు కానీ అది ఎంత నరకమో హాస్యాస్పదమో కదూ"

"అదేనండీ నా బాధ కూడా. మీకు తెలుసో తెలియదో ఈ అగ్రహారం సుధాముడన్న మీ పేరే మర్చిపోయింది. మీ స్థితిని చూచి మిమ్మల్ని కుచేలుడంటోంది. ఇటువంటి పరిస్థితిలో నాకున్న ఒకే ఆశ కృష్ణుడు. మీరు అప్పుడప్పుడు మీ స్నేహితుని గురించి చెప్పినదాన్ని బట్టి అతనే ఏమైనా చేయగలడని, చేస్తాడని నా నమ్మకం"

"తాళికట్టి నీకు మొగుడిని, పిల్లల్ని కని మగవాడినయ్యానే కానీ భరించే భర్తను కాలేకపోయాను. నువ్వు అక్షరాలా అర్ధాంగివనిపించుకున్నావు. ఎన్ని జన్మలెత్తి నీ రుణం తీర్చుకోగలను మైత్రీ"

"పొగడ్తలు మాని అసలు విషయం చెప్పండి. అవతల గంజి సిద్ధంగా వుందనుకుంటాను. పిచ్చి 'యాజ్ఞి' అన్నీ పనులూ సైగతో చెబితే చేత్తో చేసేస్తుంది. మిగిలిన పిల్లల్ని వెతికి తీసుకురావాలి"

"అలవాటే కానీ, నీ మాట ప్రకారమే చేద్దాం. కానీ రాజు దగ్గరకు, రోగుల చెంతకు, పిల్లల వద్దకు వట్టి చేతులతో పోరాదని పెద్దలంటారు. కృష్ణుడు రాజు కాకపోయినా రాజ పూజ్యుడు. ఏం తీసుకెళ్ళను"

"హమ్మయ్య. ఇప్పటికైనా బయలుదేరడానికి ఒప్పుకున్నారు. చేసిన పనికి బదులుగా యాజులు గారి భార్య అటుకులిచ్చింది. అవే మీకు కొంత, మీ స్నేహితునికి కొంత కట్టిస్తాను. అతనికీ అటుకులంటే యిష్టమన్నారుగా. తెల్లవారకే బయలుదేరండి. ప్రయత్నం మనది ఫలితం పైవానిది. ఇదేగా కృష్ణుని అభిమతం. నైవేద్యానికి వేళయ్యింది"

* * *

"సుధామా, నిజంగా నువ్వేనా ఇన్నాళ్ళకు నేను గుర్తొచ్చానన్నమాట. రా, రథమెక్కు.. ఇంటికి వెళుతూ మాట్లాడుకుందాము.

"కృష్ణా, నిజంగా నేనదృష్టవంతుడినయ్యా. నువ్వు ఎక్కడుంటావ్ తెలియదు. నా అదృష్టం కొద్దీ ద్వారకలో వుండడమే కాదు, నిన్ను చాలా సులువుగా కలుసుకోగలిగాను. బయలుదేరేటప్పుడు ఏ మహాతల్లి ఎదురొచ్చిందో కానీ..."

"ఇంకెవరుంటారు సుధామా. నీ గృహలక్ష్మి ఎదురుగా వచ్చిందని నా అనుమానం" ఇద్దరూ ఆత్మీయంగా నవ్వుకుంటారు.

"సుధామా! నీ గృహలక్ష్మి కుశలమా. పిల్లలెలా వున్నారు?"

"నీ వంటి శ్రేయోభిలాషుల ఆశీస్సులు. అందరూ క్షేమమే. మరి నీ విషయం"

"నన్ను చూస్తే తెలియటం లేదూ. ఈ రథం లాగే సాగిపోతోంది"

"అదే కృష్ణా నాకర్థం కాని విషయం. నిన్ను చూస్తుంటే, నీ ఉత్సాహాన్ని చూస్తుంటే ఈ నడి వయసు లక్షణాలేవీ కనబడడం లేదు. ఆర్యావర్తమంతా నీపేరే. నీకింత తిరిగే ఓపిక ఎక్కడిది"

"సుధామా నీ వాలకం చూస్తుంటే యింట్లో మాట్లాడడానికి విషయాలేవీ మిగిల్చేటట్లు లేవు"

"నా ప్రశ్నలకి ఇది జవాబు కాదనుకుంటాను కృష్ణా"

"అదంతా లేదు. ఉత్సాహమన్నది మొదటి నుండీ వున్నదే. ఏ వ్యాపకమూ లేకుండా నేనుండలేను. నా చుట్టూ వున్న ప్రజల కళ్ళల్లో నా పట్ల కనపడే నమ్మకం, అభిమానం ఇవే నా ఓపికను పెంచుతాయి. ఈ ప్రకృతిని పరిశీలిస్తే తాను ఇతరుల నుండి పొందిన దానికన్నా ఇతరులకు ఇచ్చుటలోనే ఆనందం పొందడం నాకు కనిపిస్తోంది. సహాయం చేయగలిగి వుండి చేయకపోవడం మంచిది కాదు కదూ. మన యిల్లు కూడా వచ్చేసింది దిగు. ఎటువంటి సంకోచమూ వద్దు. చిన్నప్పటినుండి నీలో కలివిడి తక్కువ. అలాంటివేవీ పెట్టుకోకు" అన్నాడు రథం ఆపుతూ.

రథం ఆగిన శబ్దం విని మహాలక్ష్మి లాంటి స్త్రీ వచ్చింది.

"రుక్కూ ఇతను నా బాల్య స్నేహితుడు పేరు..."

"సుధాముడు" పూర్తిచేసింది రుక్మిణి.

"నీకెలా తెలుసు. నీవిదేగా తొలిసారి చూడడం"


"కావచ్చు, మీరిద్దరి కళ్ళల్లో ఒకరిపట్ల మరొకరికున్న ఆరాధనా, ఆప్యాయతతో మీరు పట్టుకున్న ఆ చేయి తీరు చూసి ఊహించాను. అదీగాక మీ చిన్ననాటి ముచ్చట్లు చెప్పేటప్పుడు తరచుగా యీయన గురించి చెబుతూనే వుంటారుగా"


"నీ ఊహ ఎప్పుడు తప్పింది కనుక. సరే ఈ నా స్నేహితుని నీకప్పగిస్తున్నాను. ఎలా మర్యాదలు చేస్తావో ఏమో" అన్నాడు నవ్వుతూ.

"మీరంతగా చెప్పాలా. రండన్నయ్యగారూ. మీరేమీ మొహమాటపడొద్దు. ఇది మీ చెల్లాయి యిల్లు. చెలీ వీరికి స్నానాదులకు సిద్ధం చేయి"

"ఏవిటి సుధామా అలా చూస్తున్నావు. అన్నట్టు నీకు రుక్మిణిని పరిచయం చేయలేదు కదూ. ఈమె విదర్భ రాజపుత్రి రుక్మిణి. ఇంక మా పెళ్ళి కథ నువ్వు వినే వుంటావు"

"రుక్కూ! ఏదో పని వుండి నగర ద్వారం వైపు వెళ్ళాను. ద్వారపాలకుడొకడు 'ఎవరో మీ బాల్య స్నేహితుడంట అనుమతించమంటారా' అన్నాడు. ఈ సాయం వేళప్పుడు ఎవరొస్తారా అని పరిశీలిస్తే సుధాముడు.






''అన్నట్టు సుధామా.. నిన్ను ద్వారపాలకులు మరీ ఇబ్బందిపెట్టలేదుగా. జరాసంధాదుల బారి నుండి యదు జాతి సర్వనాశనం కాకుండా ఉండడానికి, మధుర నుండి వీరిని ఇంతదూరం తీసుకువచ్చి ఈ నగర నిర్మాణం కావించాము. భద్రత కారణంగా నిర్ణీత వేళలు దాటిన తరువాత కొత్తవారికి ప్రవేశం కఠినతరమయ్యింది''

''లేదు కృష్ణా. ఆపద్బాంధవునిలా నీవు సరిగ్గా వేళకి వచ్చావు''

''శ్రీవారూ మాటల్తోనే కాలం గడుపుతారా. స్నానాదులేమైనా ఉన్నాయా''

''రా సుధామా. నీకు స్నానాలగది చూపిస్తాను. నీ మూటల్ని ఇక్కడే పెట్టు. అవునూ ఈ చిన్ని మూట ఏమిటి ఇలా యియ్యి''

'' ఏమీలేదు మిత్రమా'' అంటూ వెనకకి తీసుకోబోయాడు.

'' ఏమీ లేదంటే ఏదో వున్నట్టే'' అంటూ లాక్కుని విప్పుతాడు. అటుకులు బయటపడతాయి.

''సుధామా! నాకిష్టమైన అటుకులు తెచ్చి నాకివ్వకుండానే పోదామనుకున్నావా. చిన్నప్పుడైతే నీ వాటాకూడా నాకే యిచ్చేవాడివి. అయినా సుధూ నీవు నాకళ్ళు కప్పలేవయ్యా''

''రుక్మిణీ ఈ రాత్రికి ఫలహారం ఈ అటుకులే. పోపు వేసి సిద్ధం చేసి వుంచు. ఈ లోపల స్నానం, సాయం సంధ్యాదులు కానిస్తాము''

* * *

''కృష్ణా! నేనొచ్చి పక్షం రోజులయ్యింది. జీవితంలో నిన్ను తిరిగి చూడలేననుకున్నా. నిన్ను మనసారా చూడడమే కాదు. తిరిగి చిన్ననాటి ముచ్చట్లతో ఎన్నో సంగతులు జ్ఞప్తికి వచ్చేలా చేసావు. పక్షం రోజులు ఎలా గడిచాయో తెలియదు. నీవు, చెల్లాయి రుక్మిణి చూపిన ఆదరాభిమానాలకు ఎలా కృతజ్ఞతలు తెలపాలో తోచటం లేదు. మీతో గడిపిన ప్రతిక్షణం ఆనందించాను. ఆనందించాననటం కన్నా జీవించాననడమే మేలు. ఒకే కొరత.. సమయానికి బలదేవుడు తీర్థయాత్రల్లో ఉండడం. లేకుంటే అతన్నీ చూసే అదృష్టం కలిగేది. మరి మీ దంపతులు సెలవిప్పిస్తే బయలుదేరుతాను''

''సుధూ! స్నేహితుల మధ్య కృతజ్ఞతలేమిటి. నీ రాక మాకూ ఆనందాన్నిచ్చింది. ఏ కల్మషమూ ఎరుగని వయసులో ఏర్పడినదే నిజమైన స్నేహం. సరే నీ ప్రయాణానికి పల్లకీ సిద్ధం చేస్తాను. కాదనకు. నీ చెల్లాయి రుక్మిణి నీకు నీ గృహలక్ష్మికి పిల్లలకు బట్టలు పెడతానంటోంది''

''కృష్ణా! నువ్వు నన్ను మొహమాటపెడుతున్నావు''

''అన్నయ్యగారూ, మీరు మావారి బాల్యమిత్రులే కాదు వేదమూర్తులైన బ్రాహ్మణులు. మాకు మాత్రం మళ్ళా ఈ అవకాశం వస్తుందా చెప్పండి''

* * *

''ఇదేమి అగ్రహారం ఇంత సందడిగా వుంది. ఏదో శుభకార్యం జరుగుతున్నట్టుందే. ఆ వస్తున్న గుంపులో మైత్రికూడా వున్నట్టుందే. నా కళ్ళు నన్నేమీ మోసం చేయడం లేదు. ఆ వస్తున్న గుంపులో మైత్రీ, పిల్లలే కాదు అగ్రహారం పెద్దలూ కనబడుతున్నారు. అరే కృష్ణుడు రుక్మిణీ కూడా వున్నారే. వీరిద్దరూ ఎప్పుడొచ్చారిక్కడికి''

''ఏమిటిదంతా మైత్రీ'' అన్నాడు పాదాలకు నమస్కరించిన మైత్రేయిని పైకెత్తుతూ సుధాముడు.

''నీకోసమే సుధామా ఈ హడావిడి అంతా. మరీ అలా ఆశ్చర్యపోకు. ప్రాతఃకాల విధులన్నీ అయ్యాయా''

''అయ్యాయి కృష్ణా. కానీ ఏవిటీ హడావిడి''

''మరోసారి మంగళస్నానం చేసిరా. అంతా తెలుస్తుంది'' బ్రాహ్మణోత్తములారా మీరు తదుపరి కార్యములకు సిద్ధం చేయండి''

* * *

''సుధామా! ఈరోజు రుక్మిణి పుట్టినరోజు. మా యిద్దరి పెళ్ళిరోజు కూడా. ఈ శుభదినాన నీకు ఈ ఇల్లు దానం చేస్తున్నాను. ఈ యింటికి అటుగా వున్న అన్ని వసతులతో కూడిన కుటీరం వుంది. దానిలో ఈ రోజే గురుకులాన్ని ప్రారంభిస్తున్నాను. దాని పూర్తి నిర్వహణ భారం నీదే. అందుకై వేయి గోవులను, వలసినంత వ్యవసాయ క్షేత్రాన్ని కూడా యిస్తున్నాను. గ్రహించు. అన్నట్టు వచ్చే మాఘమాసంలో యాజ్ఞిని, ఆచార్యుల వారు తన కోడలుగా స్వీకరించుటకు ఒప్పుకున్నారు. మాఘమాసం వరకు సమయం చాలనుకుంటాను. అప్పుడు నేను రుక్మిణి మరలా వస్తాము. అంతవరకుసెలవు''

* * *

''ఏవండీ మీరు ద్వారకలో ఉన్నన్నాళ్ళు మీ మిత్రుడు అక్కడే వున్నాడా''

''లేదు మైత్రీ. నేను ద్వారక చేరిన రెండోరోజు రాత్రి తాను నాలుగురోజుల పాటు నగరం విడిచి పనిమీద వెళుతున్నానని, ఆ నాలుగు రోజులూ ద్వారకా నగరాన్ని, చుట్టుపక్కల పుణ్యక్షేత్రాలని చూడమని అన్నాడు. అందుకు కావలసిన ఏర్పాట్లూ చేశాడు. వచ్చిన తరువాత చిన్ననాటి ముచ్చట్లు మాట్లాడుకోవడానికే సరిపోయింది. ఇంక రుక్మిణి వుందంటే అన్నయ్యగారూ, అన్నయ్యగారూ అంటే ఒకటే హడావిడి చేసేది. నిజంగా ఆమె మహాలక్ష్మే. నోరు విడిచి వచ్చిన పనిని ప్రస్తావిద్దామనుకున్నా. కుదరనిస్తేగా. చిన్నప్పుడు ఎంత ఆప్యాయత కనబరిచేవాడో అంతే నేడు కూడా''

''బహుశా అప్పుడే అనుకుంటానండి. ఒకరోజు ఉదయం పూజాదులు గావించి బయటకు వచ్చి చూస్తే ఎదురుగా దేవునిలా కృష్ణుడు. అతనితో అగ్రహారం పెద్దలు. నన్ను తోటకు తీసుకువచ్చాడు. ఈ ఇల్లు నచ్చిందా అన్నాడు. నా నోట మాటరాలేదు. పిల్లల్ని అడిగాడు. మా మౌనాన్నే సమ్మతిగా భావించి మిగిలిన సదుపాయాలు గావించడానికి పురమాయించాడు.

''యాజ్ఞిని చూసి వెళ్ళేప్పుడన్నాడు. అదో పిచ్చిపిల్ల. అదేం చెబుతుంది. నేనే ఎలాగో నోరు పెగుల్చుకుని మాట్లాడాను. ఆచార్యుల వారితో ఏమి మాట్లాడాడో తెలియదు. ఆయనే పెళ్ళి విషయం ఎత్తాడు. నాటినుండి అగ్రహారం పెద్దలు మనల్ని చూసే చూపులో మార్పును గమనించాను. కృష్ణుడు ఉన్నంతసేపూ మనసు ఎంత ప్రశాంతంగా ఉందనీ. అగ్రహారంలో ఆనందాశ్రువులు రాల్చని కన్నులు లేవనుకోండి. మీరు ఇప్పుడు చెప్పేవరకు మీరు అతణ్ణి సహాయం అడగలేదనుకోలేదు''

''మైత్రీ! వేదాలలో భగవంతుడు కరుణా సముద్రుడని వుంది. కృష్ణుడు మనపై చూపిన కరుణకే పేరు పెట్టగలం. అతని సహాయానికి ఏ పేరు పెట్టగలం. అతను చూపిన దారిన పయనించడం తప్ప''

''నిజమేనరండి. నోరు విప్పకుండానే సహాయహస్తాన్ని అందిస్తాడు కాబట్టే బతికుండగానే భగవంతుడనిపించుకుంటున్నాడు. అటువంటి మిత్రుడు గల మీరు ధన్యులండి''

''అంతా నీ నమ్మకం మైత్రీ'' అన్నాడు సుధాముడు.



50